క్లుప్తంగా

15న మారథాన్ రన్



మాట్లాడుతున్న డాక్టర్ ఎల్.భాస్కర్

కర్నూలు(హాస్పిటల్): హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన కల్పించడంలో భాగంగా ఈ నెల 15వ తేదీన మారథాన్ రన్ నిర్వహించనున్నట్లు జిల్లా ఎయిడ్స్ అండ్ లెప్రసీ అధికారి డాక్టర్ ఎల్.భాస్కర్ తెలిపారు. ఈ విషయమై గురువారం ఆయన తన ఛాంబర్‌లో కార్యాచరణ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. అన్ని శాఖల అధికారుల సహకారం, సమన్వయంతో 5కే మారథాన్ రన్‌ను 17 నుంచి 25 ఏళ్లలోపు వయసున్న అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీలు, యూనివర్సిటీ విద్యార్థులు పాల్గొనేలా చూడాలని కోరారు. పూర్తి వివరాలకు విద్యార్థులు వారి కళాశాలల్లోని ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ అండ్ ఆర్ఆర్‌సీ అధికారులను సంప్రదించాలని సూచించారు. మారదాన్ రన్‌తో పాటు డ్రామా, రీల్, క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 30వ తేదీ వరకు అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీలలో అవగాహన కార్యక్రమాలు చేపట్టేందుకు కార్యాచరణ రూపొందించినట్లు చెప్పా రు.జిల్లా స్థాయిలో గెలుపొందిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామన్నారు. సెట్కూ రు సీఈఓ పీవీ.రమణ, ఆర్ఆర్‌సీ కో–ఆర్డినేటర్ డాక్టర్ రామలింగారెడ్డి, ఆర్‌యూ ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ రఘు, యువజన సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా రామిరెడ్డి తాత జయంతి

కల్లూరు: కల్లూరులో వెలసిన అవధూత రామిరెడ్డి తాత జయంతి, శ్రీ కృష్ణాష్టమి వేడుకలు గురువారం తాత భక్త నివాస్‌లో అత్యంత వైభవంగా జరిగాయి. ఉదయం మేలుకొలుపు పంచామృతాభిషేకం, సుప్రభాత సేవ, హారతి, అర్చన, మహా మంగళహారతి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం శ్రీ రంగనాథం గ్రూపు,శ్రీ అన్నమాచార్య, శ్రీ వేంకటేశ్వర సేవా ట్రస్టు వారి ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా 108 సార్లు లలితా సహస్రనామం పారాయణం దిగ్విజయంగా జరిపారు. భక్త నివాస్ యందు ధార్మిక, ఆధ్యాత్మిక, జ్యోతి ప్రజ్వలన కార్యక్రమాలు నిర్వహించారు. కల్లూరు పురవీధుల గుండా కోలాటాలతో పల్లకీ సేవ చేపట్టారు. మధ్యాహ్నం హారతి అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. తాత సేవా సంస్థాన్ అధ్యక్షులు దాసరి రామచంద్రారెడ్డి, కమిటీసభ్యులు,అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

9న స్కేటింగ్ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): ఈ నెల 9వ తేదీ ఉదయం 8 గంటలకు స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో జిల్లాస్థాయి స్కేటింగ్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా రోలర్ స్కేటింగ్ సంఘం కార్యదర్శి బైరెడ్డి పక్కిరెడ్డి, ఉపాధ్యక్షులు సునీల్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్టేడియంలో ఉన్న స్కేటింగ్ రింగ్‌లో ఇన్‌లైన్, క్వాడ్ స్కేటింగ్, రింక్ రేస్, రోడ్ రేస్ క్రీడాంశాల్లో ఎంపిక పోటీలు ఉంటాయని తెలిపారు. ఆసక్తి కలిగిన స్కేటింగ్ క్రీడాకారులు ప్రవేశ రుసుంతో పాటు వయసు ధ్రువీకరణ పత్రం వెంట తీసుకొని పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 9010501082 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

పీజీ పరీక్షలకు 24 మంది గైర్హాజరు

కర్నూలు (న్యూసిటీ): రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో జరుగుతున్న పీజీ నాల్గవ సెమిస్టర్ పరీక్షలకు 24 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఉపకులపతి ఆచార్య ఎ.ఆనందరావు తెలిపారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో పీజీ పరీక్షలకు ఆరు కేంద్రాలను ఏర్పాటు చేయగా 537 మందికి గానూ 513 మంది విద్యార్థులు పరీక్ష రాశారని ఆయన గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు నాబార్డు సమావేశం

కర్నూలు(అగ్రికల్చర్): రాయలసీమ జిల్లాలతో పాటు ప్రకాశం జిల్లాలకు చెందిన 15 ప్రభుత్వ శాఖల అధికారులతో నాబార్డు శుక్రవారం జోనల్ స్థాయి సమావేశం నిర్వహించనుంది. రూరల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఫండ్(ఆర్ఐడీఎఫ్) వినియోగంపై ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు నాబార్డు డీడీఎం సుబ్బారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో రానున్న రోజుల్లో ఆర్ఐడీఎఫ్ నిధుల వినియోగంపై చర్చించి నిధులు విడుదల చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

11,12న ఎస్‌జీఎఫ్ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): ఈనెల 11, 12 తేదీలలో స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో కర్నూలు మండల స్థాయి ఎస్‌జీఎఫ్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు ఎం.వెంకటేశ్వర్లు ఎం.విజయ్‌కు మార్‌లు వెల్లడించారు. గురువారం సాయంత్రం స్థానిక టౌన్ మోడల్ పాఠశాలలో వ్యా యామ ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కర్నూలు మండల, నియోజకవర్గం స్థాయిలో అన్ని పాఠశాలలకు చెందిన అండర్–14, అండర్–17 విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. 11న బాలురకు, 12న బాలికలకు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, త్రోబాల్, బాల్ బ్యాడ్మింటన్, షటిల్ బ్యాడ్మింటన్, యోగా, అథ్లెటిక్స్, టెన్నికాయిట్ వంటి క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. క్రీడాకారులు ఆన్‌లైన్‌లో తమ పేర్లను నమోదు చేసుకొని ప్రధానోపాధ్యాయుల అనుమతి పత్రాలతో రావాలన్నారు.

ఫిజియోథెరపీతో హ్యాపీ

- నొప్పుల నుంచి ఉపశమనం
- పలు వ్యాధులకు మెరుగైన ఫలితం
- కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో రోజూ 80 నుంచి 120 మందికి చికిత్స
- నేడు వరల్డ్ ఫిజియోథెరపీ డే



కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఫిజియోథెరపీ చికిత్సా కేంద్రం

కర్నూలు(హాస్పిటల్): ఆధునిక వైద్య విద్యలో ఫిజియోథెరపీ ఒక నూతన అధ్యాయం. ఫిజియోథెరపీ అంటే ఫిజికల్ ఎక్సర్‌సైజ్ (శారీరక వ్యాయామం). ప్రస్తుతం ఎన్నో రకాల జబ్బులను మందుల ద్వారా గాకుండా కేవలం ఫిజియోథెరపీ ద్వారా నయం చేస్తున్నారు. దీర్ఘకాలిక జబ్బులను ఫిజికల్ ఎక్సర్‌సైజ్‌ల ద్వారా తగ్గిస్తున్నారు. ముఖ్యంగా ఆర్థో, న్యూరో స్పెషలిస్టులు తమ వద్దకు వచ్చే రోగుల శారీరక సమస్యలను బట్టి అందుకు అనుగుణంగా వ్యాయమాలు చేయాలని సూచిస్తున్నారు. ఎలాంటి సమస్యలకు ఏ విధమైన వ్యాయామం చేయాలనే విషయంలో ఫిజియోథెరపిస్ట్ ఆధ్వర్యంలో ఈ వైద్యం పొందవచ్చు. నేడు వరల్డ్ ఫిజియోథెరపీ డే సందర్భంగా ప్రత్యేక కథనం.

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ప్రస్తుతం 960 మంది దాకా ఫిజియోథెరపిస్ట్‌లు ఉన్నారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఏర్పాటు చేసిన ఫిజియోథెరపీ కేంద్రంలో ముగ్గురు పనిచేస్తున్నారు. వీరితో పాటు ప్రైవేటు ఫిజియోథెరపీ కాలేజీల నుంచి ఇంటర్న్‌షిప్ (ఆరు నెలలు) కోసం విద్యార్థులు ఇక్కడ శిక్షణ పొందుతున్నారు. ఇక్కడికి ఆర్థోపెడిక్, న్యూరాలజీ, న్యూరోసర్జరీ, జనరల్ సర్జరీ, జనరల్ మెడిసిన్, ఈఎన్‌టీ, కార్డియాలజజీ తదితర విభాగాల నుంచి ఫిజియోథెరపీ కోసం వస్తుంటారు. ఇక్కడికి రాలేని రోగుల వద్దకే ఫిజియోథెరపిస్టులు వెళ్లి వ్యాయామాలు ఎలా చేయాలో సూచిస్తున్నారు. ఈ విభాగం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పనిచేస్తుంది. ఇక్కడ టెన్స్, ఇంటర్ ఫెరిన్షియల్ థెరపీ, అల్ట్రాసోనిక్ థెరపీ, ఎలక్ట్రికల్ స్టిమిలేటర్, షార్ట్‌వేవ్ డయాటర్మి, సీపీఎం డివైస్, లేజర్, ట్రెడ్‌మిల్, బైసైకిల్ అర్గోమీటర్, క్వాడ్రిసెట్స్ టేబుల్, పారలల్ బార్, షోల్డర్ వీల్, స్విస్ బాల్స్‌తో పాటు పలు వ్యాయామ పరికరాలున్నాయి. వీటి ద్వారా ప్రతి ఒక్కరికీ ఉచితంగా చికిత్స అందిస్తున్నారు. దీంతో పాటు నంద్యాల జిల్లా ఆసుపత్రిలో, ఆదోని ఏరియా ఆసుపత్రిలో, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో ఫిజియోథెరపీస్టులు రోగులకు సేవలందిస్తున్నారు.

ఫిజియోథెరపీ చికిత్సలో రకాలు

ఫిజియోథెరపీలో అనేక రకాలు ఉన్నాయి. అందులో ప్రధానంగా 8 అంకెపై నడవడం, రెండు సరళ రేఖల మధ్య నడవడం వల్ల దశల వారీగా ఫిజియోథెరపీ చికిత్స చేస్తారు. దీనివల్ల కీళ్ల బిగుతుగా మారకుండా కదలిక యథావిధిగా ఉండేలా కండరాలు బిగుతుగా మారకుండా, క్షీణించకుండా, రక్తప్రసరణ యథావిధిగా జరిగేలా దోహదపడతాయి. మంచంపై ఒకే స్థితిలో పడుకోకుండా అత్యధిక ఒత్తిడి కలిగిన ప్రాంతాలపై పుండ్లు/అల్సర్‌లు పెరగకుండా ఉండేందుకు పొజిషన్ చేంజింగ్, బెడ్ రోలింగ్ ఎక్సర్‌సైజ్‌లు చేయిస్తారు. ఇవే గాక వెయిట్ బేరింగ్ ఎక్సర్‌సైజ్‌లు, న్యూరో డెవలప్‌మెంట్ ట్రైనింగ్, కో–ఆర్డినేషన్ ఎక్సర్‌సైజ్‌లు, చేతికి సంబంధించిన ఎక్సర్‌సైజ్‌లను ఫిజియోథెరపిస్ట్‌లు చేయిస్తారు.

సైడ్ ఎఫెక్ట్స్ లేని వైద్యం

ఎంతో మంది దేశ, విదేశాల్లోని వైద్యనిపుణులు ఫిజియోథెరపీని ప్రోత్సహిస్తున్నారు. ఈ వైద్యం ద్వారా దీర్ఘకాలిక సమస్యలైన స్పాండిలైటిస్, ఫ్రోజెన్ షోల్డర్, టెన్నిస్ ఎల్బో తదితర ఇబ్బందుల నుంచి ఉపశమనం పొందవచ్చు. ఈ మధ్యకాలంలో యువత, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఫోన్లు, కంప్యూటర్లు వాడకం వల్ల భుజాలు, మెడ, నడుము నొప్పులతో బాధపడుతున్నారు. ఇలాంటి వారికి ఫిజియోథెరపీ వైద్యం ద్వారా ఎలాంటి సైడ్‌ఎఫెక్ట్స్ లేకుండా ఉపశమనం కలిగిస్తుంది.

కండరాల పునరుద్ధరణకు దోహదం

ఎవరైనా గాయం, వైకల్యం కారణంగా బాధపడుతున్నప్పుడు శరీర భాగాల కదలిక పనితీరును సాధారణ స్థితికి తెచ్చేందుకు ఫిజియోథెరపీ చికిత్స ఉపయోగపడుతుంది. పక్షవాతం, మెడ నొప్పి, నడుము నొప్పి, మోకాళ్ల నొప్పి, భుజం నొప్పి, వెన్ను సమస్యలు శస్త్రచికిత్సకు ముందు, తర్వాత వాటి పనితీరును పునరుద్ధరించడానికి రిహాబిలిటేషన్ ఉపయోగపడుతుంది. నరాల బలహీనతలు, పనిచేసే చోట వచ్చే సమస్యలను అధిగమించేందుకు ఫిజియోథెరపీ ఎంతగానో దోహదపడుతుంది.

ఆపరేషన్ తర్వాత ఫిజియోథెరపీ కీలకం



పలు రకాల ఆపరేషన్ల తర్వాత ఫిజియోథెరపీ చికిత్స కీలకం. ఇది లేకపోతే కండరాల పరిమాణం తగ్గిపోయి అవి పనిచేయకుండా పోతాయి. వ్యాయామం లేకపోతే కండరాల్లో ఫైబ్రోసిస్ అభివృద్ధి చెంది వంకర్లు పోతాయి. ఎక్కువ రోజులు మంచంపై ఉంటే కాళ్లలో రక్తం గడ్డకట్టి ఎంబాలిజం వచ్చి గుండె, మెదడుకు స్ట్రోక్ వచ్చే ప్రమాదం ఉంది. సర్జరీలతో పాటు రోగి త్వరగా కోలుకోవాలంటే ఫిజియోథెరపీ చాలా ప్రధానం.

–డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి, సూపరింటెండెంట్, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల

కీళ్లనొప్పికి ఫిజియోథెరపీతో చికిత్స



వరల్డ్ ఫిజియోథెరపీ డే సందర్భంగా ఈ యేడాది ఆస్టియో ఆర్థరైటిస్ నివారణ, నిర్వహణ థీమ్ ఇచ్చారు. మనిషికి కీళ్ల నొప్పి ఎంతగా బాధిస్తుందో దానిని అనుభవించే వారికే తెలుసు. కీళ్లనొప్పి తగ్గాలంటే బరువు తగ్గడం, కాల్షియం పుష్కలంగా ఉండే పాలు, పాల ఉత్పాదనకు సంబంధించి పదార్థాలను తీసుకోవడం, విటమిన్–డి లభ్యమయ్యేలా లేత ఎండలో 30 నిమిషాల పాటు నడవటం, తగినంత వ్యాయామం చేయాలి. దీంతో పాటు కీళ్లలో బిగుతు పోయేందుకు, కీళ్లపైభాగాన ఉండే కండరాలు బలపడేందుకు ఫిజియోథెరపిస్ట్‌లను కలిసి చికిత్సతో పాటు వారి సూచన మేరకు ఇంటి వద్ద కొన్ని రకాల వ్యాయామాలు చేయాలి.

– డాక్టర్ హనీఫ్, ఫిజియోథెరపిస్ట్, కర్నూలు

విజ్ఞాన సహకారంపై ఒప్పందం



ఒప్పంద పత్రాలను చూపుతున్న ప్రతినిధులు

కర్నూలు సిటీ: స్టెమ్ విద్యలో భాగంగా విద్యార్థుల మధ్య చర్చలు, ఆచరణాత్మక నైపుణ్యాలు, సహకారాలను పెంపొందించడం కోసం అడ్వెంచర్ ఇన్ సైన్స్ ఇండియా (ఏఐఎస్ఐ)తో జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీ మధ్య ఒప్పందం జరిగింది. ఈ మేరకు గురువారం ఆ కాలేజీలో ఏఐఎస్ఐ ఫౌండేషన్ వ్యవస్థాపక సభ్యులు రఘువంతన్, కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ బి శ్రీనివాస రెడ్డి ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు.

రుణ పథకాలను సద్వినియోగం చేసుకోండి

కర్నూలు(అగ్రికల్చర్): యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ) అమలు చేస్తున్న రుణ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జనరల్ మేనేజర్ వెంకటేశ్వర స్వామి సూచించారు. గురువారం కర్నూలు అశోక్‌నగర్ బ్రాంచీలో పెద్ద ఎత్తున రుణ మేళ నిర్వహించారు. ఈ సందర్భంగా వీధి వ్యాపారులకు అవసరమైన గొడుగులు, క్యూర్ కోడ్‌లను పంపిణీ చేశారు. బ్యాంకు అమలు చేస్తున్న వివిధ రుణ పథకాలపై అవగాహన కల్పించారు. పలువురికి రుణ మంజూరు పత్రాలు అందజేశారు. రీజనల్ హెడ్ పి.నరసింహారావు, డిప్యూటీ రీజినల్ హెడ్ సురేంద్రగౌడు, బ్రాంచ్ మేనేజర్ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

బలహీన వర్గాల ద్రోహి చంద్రబాబు



మాట్లాడుతున్న ఎం.సుభాష్ చంద్రబోస్

కర్నూలు(అర్బన్): రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాలను అన్ని విధాలుగా అణచివేసిన దుర్మార్గుడు మాజీ సీఎం చంద్రబాబునాయుడు అని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం.సుభాష్ చంద్రబోస్ అన్నారు. ఆయన గురువారం తన కార్యాలయంలో మాట్లాడుతూ..చంద్రబాబు 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా పనిచేసిన సమయంలో ఆయా వర్గాలను పట్టించుకోలేదన్నారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ తదితర వర్గాలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యత కల్పించారని గుర్తుచేశారు. చంద్రబాబు కుట్ర రాజకీయాలను గత 40 ఏళ్లుగా రాష్ట్ర ప్రజలు గమనిస్తూనే ఉన్నారన్నారు. ప్రజలను ఎలాగోలా మభ్యపెట్టి రాజకీయ లబ్ధి పొందాలని అనేక కుట్రలు, కుతంత్రాలకు తెరలేపుతున్నారని మండిపడ్డారు. చంద్రబాబు, లోకేష్ యాత్రలకు ప్రజల్లో స్పందన లేకపోవడం వల్ల తమ కార్యకర్తల ను రెచ్చగొడుతూ గొడవలు సృష్టించేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. రానున్న ఎన్నికల అనంతరం చంద్రబాబు,లోకేష్ ఓటమి పాలై రాజకీయా ల నుంచి కనుమరుగు కావడం ఖాయమన్నారు.

నేడు చంద్రబాబు విశ్వసనీయతపై చర్చ

'మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు విశ్వసనీయత – బాబు హామీలు నమ్మశక్యమేనా' అనే అంశంపై ఈ నెల 8వ తేదీన చర్చా కార్యక్రమం నిర్వహించనున్నట్లు సుభాష్ చంద్రబోస్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ మద్దయ్య, బీసీ విభాగం రాష్ట్ర కార్యదర్శి దేవపూజ ధనుంజయ ఆచారి, బత్తుల లక్ష్మీకాంతయ్య తెలిపారు. స్థానిక దేవనగర్‌లోని ఎంఎస్ 9 భవనంలోని సమావేశం హాల్‌లో మధ్యాహ్నం 2.30 గంటలకు కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. పెద్ద సంఖ్యలో యువత, మహిళలు, మేధావులు, రాజకీయ విశ్లేషకులు హాజరు కావాలని కోరారు.



గోదాగోకులంలో కృష్ణయ్య



శ్రీకృష్ణ రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

జయ కృష్ణా ముకుంద మురారీ



గోదాగోకులంలో గోపూజ చేస్తున్న భక్తులు

కర్నూలు కల్చరల్: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఇస్కాన్, గోదా గోకులం, దక్షిణ షిరిడీ సాయిబాబా దేవస్థానం తదితర ఆలయాల్లో వేడుకలు అంబరాన్నంటాయి. గోమాత పూజ, ఉట్లోత్సవం నిర్వహించారు. చిన్ని కృష్ణులు, గోపికల వేషధారణలు, నృత్యాలు అలరించాయి. వేడుకల్లో కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్, కేడీసీసీబీ చైర్మన్ ఎస్వీ విజయమనోహరి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి, పారిశ్రామిక వేత్త టీజీ భరత్ పాల్గొన్నారు.

- ఇస్కాన్ జగన్నాథ మందిరంలో గోకులాష్టమి వేడుకలు వైభవంగా జరిగాయి. శుభమంగళ హారతి, దర్శన హారతి, హరినామ సంకీర్తన, రాజభోగహారతి, మహా శంఖాభిషేకం, 108 ఆహార పదార్థాలతో రాజభోగ నివేదన, శ్రీమద్భాగవత ప్రవచనం జరిగాయి. ఇస్కాన్ ప్రవచకులు వైష్ణోకృప చైతన్య ప్రభు సందేశమిచ్చారు. పారిశ్రామిక వేత్త టీజీ భరత్, ఇస్కాన్ సభ్యులు పాల్గొన్నారు.
- తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో కర్నూలు నగర శివారులోని గోదా గోకులంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తిరుమంజనం, విశేషాలంకరణ, అర్చన, వివిధ భజన బృందాలచే శ్రీకృష్ణ భజనలు, గోపూజ, నివేదన, ప్రసాద వితరణ, శ్రీగోదా గోపిక శ్రీకృష్ణుల పల్లకీ ఊరేగింపు, గోపికలు, గోపబాలురచే ఉట్లోత్సవం, ఊంజల సేవ, పవళింపు సేవ కార్యక్రమాలు జరిగాయి.
- చిత్తారి వీధిలో నిర్వహించిన కార్యక్రమంలో కేడీసీసీబీ చైర్మన్ ఎస్వీ విజయమనోహరి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. శ్రీకృష్ణ రథోత్సవాన్ని నిర్వహించారు. ఉట్టి కొట్టే కార్యక్రమంలో పాల్గొని కాలనీ వాసులను ఉత్సాహ పరిచారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, ఎస్వీ యూత్ పాల్గొన్నారు.

కర్నూలు కల్చరల్: యాదవులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని యాదవ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు అయ్యన్న యాదవ్, ఉపాధ్యక్షులు శ్రీరాములు యాదవ్ డిమాండ్ చేశారు. యాదవ సంఘం ఆధ్వర్యంలో గురువారం నంద్యాల చెక్‌పోస్ట్ సమీపంలోని రుక్మిణీ సమేత శ్రీకృష్ణ మందిరంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. కలెక్టరేట్ నుంచి ఆలయం వరకు శ్రీకృష్ణ రథోత్సవాన్ని నిర్వహించారు. చిన్ని కృష్ణులు, గోపికల వేషధారణలు, నృత్య ప్రదర్శనలు, ఉట్లోత్సవం ఉత్సాహంగా సాగాయి. యాదవ సంఘం సీనియర్ నాయకులు తిమ్మయ్య యాదవ్, బాలమద్దయ్య యాదవ్, నారాయణ, నాగేశ్వరరావు, హరికిషన్, రాహుల్, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

30లోపు భూహక్కు పత్రాల పంపిణీ



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన ఇన్‌చార్జ్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య

కర్నూలు(సెంట్రల్): పెండింగ్‌లోని భూ హక్కు పత్రాలను సెప్టెంబర్ 30వ తేదీలోపు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని భూ పరిపాలన ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ అధికారులను ఆదేశించారు. గురువారం విజయవాడ సీసీఎల్ఏ కార్యాలయం నుంచి ఆయన అన్ని జిల్లాల కలెక్టర్లు, జేసీలతో రీసర్వే, ఇతర భూ సమస్యలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ.. భూ హక్కు పత్రాల్లో ఎలాంటి తప్పులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కొన్ని జిల్లాల్లో ఆన్‌లైన్ నమోదులో పెండింగ్‌లో ఉన్న కరెక్షన్ ఆఫ్ మాడ్యూల్స్‌లో భాగంగా రైతు పేరు, ఊరి పేరు, ఖాతా నంబర్ తదితర వివరాలను పరిశీలన చేసే పనులను ఈ శనివారంలోపు పూర్తి చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న స్టోన్ ప్లాంటేషన్ ప్రక్రియను నిర్దేశిత గడువులోపు పూర్తి చేయాలన్నారు. గతంలో భూమిలేని నిరుపేదలందరికీ అసైన్ చేసిన భూముల్లో లబ్ధిదారుడు ఉన్నారా లేదా అన్న విషయాలను పరిశీలించి ఈనెల 10వ తేదీలోపు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఫేజ్–2లో పూర్తైన రీసర్వేకు సంబంధించి భూ హక్కు పత్రాలు రాగానే రైతులకు అందజేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు మనోజ్ రెడ్డి, రమణకాంత్ రెడ్డి, సర్వే అధికారులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలకు ఆధార్ అప్‌డేట్ తప్పనిసరి

కర్నూలు(సెంట్రల్): సంక్షేమ పథకాలకు అర్హులు కావాలంటే ప్రజలు తమ ఆధార్‌ను కచ్చితంగా అప్‌డేట్ చేసుకోవాలని, ఈవిషయంలో తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో సమీక్షించారు. ఈనెల 30 నుంచి జగనన్న ఆరోగ్య రక్ష పథకం ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమంలో భాగంగా సెప్టెంబర్ 15వ తేదీలోపు వలంటీర్లు, ఏఎన్ఎంలు ఇళ్లిళ్లు తిరిగి పిల్లలు, వృద్ధులు, గర్భిణులు, బాలింతలతోపాటు అనారోగ్యంతో బాధపడుతున్న వారి వివరాలను సేకరించి యాప్‌లో నమోదు చేయాలన్నారు. 45 రోజులపాటు జరిగే ఈ కార్యక్రమానికి ప్రతి క్యాంపునకు ఇద్దరు డాక్టర్లు(గైనకాలజిస్టు, జనరల్ ఫిజిషియన్), స్పెషలిస్టు వైద్యుడు అంటుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, ఇతర జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పిల్లల్లో లోపాలను గుర్తించాలి



మాట్లాడుతున్న హేమలత

కర్నూలు(హాస్పిటల్): పుట్టుకతో వచ్చే లోపాలను సకాలంలో గుర్తించకపోతే పిల్లలు జీవితాంతం వైకల్యాలను ఎదుర్కోవాల్సి వస్తుందని, సకాలంలో గుర్తించి చికిత్స చేయిస్తే వారికి ఆరోగ్యకరమైన భవిష్యత్ అందించగలిగిన వారమవుతామని రాష్ట్రీయ బాలస్వాస్థ్య కార్యక్రమం జిల్లా కో–ఆర్డినేటర్ హేమలత చెప్పారు. రాష్ట్రీయ బాలస్వాస్థ్య కార్యక్రమంపై గురువారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని లెక్చరర్ గ్యాలరీలో వైద్యులు, స్టాఫ్‌నర్సులు, పారామెడికల్ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చిన్నతనంలో వచ్చే వినికిడి లోపంతో పిల్లలు మూగవారిగా ఉండిపోతారని, ఇలాంటి వారికి సకాలంలో వైద్యసహాయం అందిస్తే మాట్లాడగలగుతారన్నారు. కంటి శుక్లాలు, చిన్నతనంలో వచ్చే పక్షవాతం తదితర సమస్యలను నయం చేసే అవకాశం ఉందని చెప్పారు. గ్రామాల్లో ఆశాలు, మహిళా ఆరోగ్య కార్యకర్తలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు, పాఠశాలల్లో విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి లోపాలున్న వారిని గుర్తించి సత్వర చికిత్స కేంద్రానికి పంపిస్తే వైద్య సేవలు అందిస్తారన్నారు. డైస్ మేనేజర్ ఇర్ఫాన్, ప్రాజెక్షనిస్టు ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

లారీని ఢీకొని ఐచర్ డ్రైవర్ మృతి

గుత్తి రూరల్: రోడ్డు పక్కన నిలిపిన లారీని ఢీకొన్న ఘటనలో ఐచర్ డ్రైవర్ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. కర్నూలుకు చెందిన ఐచర్ డ్రైవర్ అబ్దుల్ ఖాదర్ (58). ఎస్ఎల్ఆర్టీ ట్రాన్స్‌పోర్టు కంపెనీలో ఐచర్ వాహనానికి డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం అర్ధరాత్రి అనంతపురం నుంచి కర్నూలు వైపుగా ఐచర్‌లో వెళ్తుండగా పోతుదొడ్డి శివారులో 44వ జాతీయ రహదారి పక్కనే ఆపిన లారీని వెనుక నుంచి ఢీకొన్నాడు. ప్రమాదంలో ఐచర్ క్యాబిన్ నుజ్జునుజ్జై డ్రైవర్ అబ్దుల్ ఖాదర్ ఇరుక్కుపోయాడు. సమాచారం అందుకున్న నంద్యాల జిల్లా ప్యాపిలి పోలీసులు అక్కడకు చేరుకుని అతి కష్టంపై క్షతగాత్రుడిని బయటికి తీసి హైవే అంబులెన్స్ ద్వారా గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స ప్రారంభించలోపు పరిస్థితి విషమించి అబ్దుల్ ఖాదర్ మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

సంస్కృతిలో జానపదాలకు ప్రత్యేక స్థానం



జ్యోతి ప్రజ్వలనతో ఉత్సవాలను ప్రారంభిస్తున్న అతిథులు

కర్నూలు కల్చరల్: దక్షిణ ప్రాంత సాంస్కృతిక కేంద్రం తంజావూరు, టీజీవీ కళాక్షేత్రం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జానపద నాటకోత్సవాలు గురువారం ముగిశాయి. ముందుగా అతిథులు జ్యోతి ప్రజ్వలనతో ఉత్సవాలను ప్రారంభించారు. దక్షిణ మధ్య ప్రాంతం సమన్వయకర్త డి.జగన్నాథం మాట్లాడుతూ.. ప్రజల హృదయాల్లో జనపద కళలు సుస్థిర స్థానం పొందాయన్నారు. కర్నూలులో మూడు రోజుల పాటు జరిగిన ఉత్సవాలకు ప్రేక్షకాదరణ లభించిందన్నారు. భరత నాట్యం కళాకారిణి వంశీ మాధవి మాట్లాడుతూ.. తాను సెంట్రల్ యూనివర్సిటీలో భరత నాట్యం నేర్పుతున్నట్లు తెలిపారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ.. జానపద శాస్త్రీయ పౌరాణిక కళలను మేళవించి ఉత్సవాలను నిర్వహించామన్నారు. ఈ సదర్భంగా కళాకారులను సన్మానించారు. అనంతరం వంశీ మాధవి ప్రదర్శించిన భరతనాట్యం, కృష్ణగిరి మండలానికి చెందిన మధు బృందం చెక్క భజన, పత్తి ఓబులయ్య దర్శకత్వం వహించిన శ్రీకృష్ణ కమలపాలిక పద్యనాటక ప్రదర్శనలు అలరించాయి. టీజీవీ కళాక్షేత్రం సభ్యులు సీవీ రెడ్డి, ఇనాయతుల్లా, గాండ్ల లక్ష్మన్న, యాగంటీశ్వరప్ప, తదితరులు పాల్గొన్నారు.

దేవదాయ ఆస్తుల పరిరక్షణకు చర్యలు



ఆక్రమిత భూమిని పరిశీలిస్తున్న దేవదాయ శాఖ ఏసీ రామాంజనేయులు, ఇతర అధికారులు

కర్నూలు కల్చరల్: ఆలయాల ఆస్తుల ఆక్రమణలను అడ్డుకుంటామని, ఎవరైనా ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని దేవదాయ శాఖ సహాయ కమిషనర్ ఎం.రామాంజనేయులు హెచ్చరించారు. గురువారం కర్నూలు మండల పరిధి జొహరాపురం గ్రామంలోని నీలకంఠేశ్వర స్వామి ఆలయానికి చెందిన ఆక్రమిత భూమిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జొహరాపురం గ్రామ రెవెన్యూ భూమి సర్వే నంబర్ 123లో విస్తీర్ణం 7.72 ఎకరాలను కొందరు ఆక్రమించుకొని గుడిసెలు వేసుకున్నారన్నారు. వారిని ఖాళీ చేయాలని పలుమార్లు నోటీస్ ఇచ్చామన్నారు. నోటీసులకు ఎలాంటి స్పందన లేకపోవడంతో గుడిసెలు వేసుకున్న వారితో చర్చించామన్నారు. గుడిసెలు వేసుకున్న వారిలో సొంతిల్లు లేని వారు ఉంటే ఆధార్ కార్డులను తెచ్చి ఇవ్వాలని జిల్లా కలెక్టర్‌తో చర్చించి ఇళ్ల స్థలాలు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. కర్నూలు డివిజన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి, ఈఓలు సీతారామిరెడ్డి, హనుమంతరావు, సాయి పాల్గొన్నారు.

భారత్ జోడో యాత్ర చరిత్రాత్మకం

కర్నూలు(సెంట్రల్): కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాహుల్‌గాంధీ చేపట్టిన భారత జోడో యాత్ర చరిత్రాత్మకమైనదని ఏఐసీసీ కార్యదర్శి సీడీ మయప్పన్ అన్నారు. రాహుల్‌గాంధీ జోడో యాత్రకు సెప్టెంబర్ 7 నాటికి ఏడాది పూర్తి కావడంతో గురువారం కాంగ్రెస్‌శ్రేణులు పాదయాత్ర చేపట్టారు. మయప్పన్‌తోపాటు ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు నాగమధుయాదవ్, డీసీసీ అధ్యక్షుడు ఎం.సుధాకర బాబు, నగర అధ్యక్షుడు జాన్ విల్సన్, కార్యకర్తలు పార్టీ కార్యాలయం నుంచి పాదయాత్రగా బయలుదేరి నెహ్రూ రోడ్డు, చౌక్ బజార్, గడియారం హాస్పిటల్, పెద్ద మార్కెట్, పాతబస్టాండ్ అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీగా వెళ్లారు. మయప్పన్ మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ గెలుపొందడం తథ్యమని జోస్యం చెప్పారు.

గృహ హక్కు పత్రాల పంపిణీ



రంగమ్మకు గృహ హక్కు పత్రాలు అందజేస్తున్న మేయర్ రామయ్య

కల్లూరు: ఓటీఎస్ పథకం గృహ లబ్ధిదారులకు వరం అని నగర మేయర్ బీవై రామయ్య అన్నారు. ఇటీవల స్థానిక 47వ సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించగా కాలనీకి చెందిన ఎస్.రంగమ్మ అనే మహిళ ఓటీఎస్ కోసం దరఖాస్తు చేశానని, అయితే ఇంటి హక్కు పత్రాలు మంజూరు కాలేదని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, మేయర్ రామయ్య దృష్టికి తీసుకొచ్చారు. వారు అధికారులతో మాట్లాడి రుణ విముక్తి పత్రాలతో పాటు ఇంటిపై శాశ్వత హక్కులు కల్పిస్తూ ధ్రువపత్రాలు మంజూరు చేయించారు. గురువారం మేయర్ కాంపు కార్యాలయంలో లబ్ధిదారు రంగమ్మకు హక్కు పత్రాలను అందజేశారు. సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.